# లవ్ లీ స్టోరీస్

## అపరిచిత

"ఆ అమ్మాయి పేరేమిటి?" అడిగింది సుమిత్ర.

"తెలీదు," చెప్పాడు వేణు.

"ఎవరమ్మాయో తెలుసా?"

"అదీ తెలీదు,"

"కనీసం ఎక్కడుంటుందో అదైనా తెలుసా?"

వేణు అది కూడా తెలీదన్నట్టు తల అడ్డంగా వూపాడు.

సుమిత్ర అతనివైపు పిచ్చివాణ్ణి చూసినట్టు చూసింది.

"ఆ అమ్మాయెవరో నీకు తెలీదు. ఎక్కుడుంటుందో తెలీదు. అయినా ప్రేమించానంటున్నావ్. ఇదంతా ఏదో వెర్రివెంగళప్ప వ్యవహారంలా నాకనిపిస్తోంది," అంది.

వేణు ఆమెకేసి దీనంగా చూశాడు. "వదినా, ఈ ఇంట్లో నువ్వు తప్ప నా బాధ అర్థం చేసుకోగలవాళ్ళెవరూ లేరు. చిన్నప్పట్నుంచీ నాకే కష్టమొచ్చినా కనిపెట్టి నువ్వే కాపాడావు. అమ్మకంటే ఎక్కువగా నువ్వే నన్ను చూసుకున్నావు. నీకంటే చెప్పుకోవడానికి నాకెవరూ లేరు. ఈ పెళ్ళి నాకిష్టంలేదు. దయచేసి ఈ రొంపిలోంచి నువ్వే నన్ను బయటికి లాగు," అన్నాడు.

సుమిత్ర నిట్టూర్చింది. "చూడు చిన్నా! నీ మనసు నేను బాగా అర్థం చేసుకోగలను. కానీ, నువ్వే ఒక్కసారి ఆలోచించు. కులం గోత్రం తెలీదు. ఎవరమ్మాయో తెలీదు. కనీసం ఆ అమ్మాయి పేరు కూడా తెలీదు. అలాంటి అమ్మాయి కోసం పెద్దవాళ్ళు ఎంతో ఆలోచించి నిర్ణయించిన సంబంధం కాలదన్నుకోవడం ఎంత వరకు సబబు చెప్పు? నీకు నిశ్చయించిన అమ్మాయిని వదులుకొని కనీసం గుర్తుకూడా తెలీని ఒక భ్రాంతి కోసం నువ్వు ఆరాటపడ్డం మరేం బాగోలేదు. ఆకాశంలో ఎన్నో మేఘాలు ప్రయాణిస్తుంటాయి. ఒక్కోసారి ఆ మేఘాలు మనకెంతో ఇష్టమైన ఆకృతిలో ఏర్పడతాయి. ఆ రూపమే శాశ్వతమని మనం అనుకోగలమా? ఆకాశానికి నిచ్చెనవేసి ఆ ఆకారాన్ని అందుకోబోయే లోపల మబ్బు కరిగిపోతుంది. ఆ భ్రాంతిని అందుకోబోయిన నీ చేతుల్లో శూన్యమే మిగులుతుంది. వాస్తవం కాని ఒక ఊహ కోసం పాకులాడ్డం ఎండమావి లో నీళ్ళు తాగాలనుకోవడం లాంటిదే. నా మాట విని పెద్దవాళ్ళు తెచ్చిన సంబంధం ఒప్పుకో. నీ మేలు అందులోనే వుంది."

వేణు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నువ్వు కూడా ఇలా చెబుతావని అనుకోలేదు," అని మాత్రం అనగలిగాడు.

సుమిత్ర కొద్ది క్షణాలు మౌనంగా కూర్చొని చివరికో నిర్ణయానికి వచ్చినట్టు నెమ్మదిగా అంది-

"సరే, ఆ అమ్మాయిని ఎక్కడు చూశావో చెప్పు."

ఆ మాటతో వేణు మొహంలో రంగు కొద్దిగా తిరిగొచ్చింది. "మన పక్కింటి కోదండ రామయ్యగారమ్మాయి పెళ్ళిలో చూశాను," అన్నాడు.

"వారమ్మాయి పెళ్ళి తిరుపతి దేవస్థానం వారి కల్యాణ మండపంలో జరిగింది. ఆ పెళ్ళికి వాళ్ళు వూళ్ళో వాళ్ళందర్నీ పిలిచారు. అంతమందిలో నువ్వు చూసినమ్మాయి ఎవరని?"

"పెళ్ళి పందిట్లో పెళ్ళి కూతురికి దగ్గరగా వున్న ఆడవాళ్ళలో ఆమె కూడా వుంది. పెళ్ళికూతురి స్నేహితురాలు కావచ్చు," అన్నాడతను.

"అయితే గుంపులో ఎవర్నో చూసి ప్రేమించేశావన్నమాట."

"ఆ మాట మాత్రం అనొద్దు. ఆ పెళ్ళిలో ఆమెను చూసిన క్షణంలోనే నాకు తెలిసిపోయింది- ఆమె నా కోసం పుట్టింది. నేను ఆమె కోసం పుట్టాను."

"సరే సరే, ఆమెను చూస్తూనే నీకేమనిపించిందో నీ అవతారాన్ని బట్టీ తెలుస్తోంది. ఇంతకీ ఆ అమ్మాయి ఎవరైవుంటుందో నువ్వు తెలుసుకోవడానికి ప్రయత్నించలేదా?"

"ప్రయత్నించాను. అయితే ఎక్కడా నాకు క్లూ దొరకలేదు."

"బాగానే వుంది. నీ రైలు బండికి ఒకటే చక్రం. అందుకే ఎక్కడున్నదక్కడే కూలబడింది. మరైతే ఇప్పుడా అమ్మాయి ఎవరో ఎలా తెలుసుకోవడం?"

"ఆ మాట ఆరోజు పెళ్ళికూతుర్నే అడిగితే?"

"ఎలా అడుగుతాం? అమ్మా, పెళ్ళి కూతురా! నీ స్నేహితురాళ్ళలో ఎవర్నో, మా అబ్బాయి ప్రేమిస్తున్నాడు. ఆ అమ్మాయి ఎవరో తెలుసుకోవడానికి నీ స్నేహితు రాళ్ళందర్నీ వర్సగా నిలబెట్టి మావాడి స్వయంవరం ఏర్పాటు చెయ్యి- అనడుగుతామా? అలా అడిగితే మనకెంత అప్రతిష్ఠ! నలుగురూ మన మొహాన్నే నవ్విపోతారు."

వేణు మొహం ఉదాసీనంగా మారిపోయింది. "అయితే ఇప్పుడేం చేయాలో చెప్పు," అన్నాడు.

"ఎవర్నీ అడక్కుండా ఆ అమ్మాయెవరో తెలుసుకోవడానికి ఒక మార్గం వుంది," అంది సుమిత్ర.

వేణు మొహం ఒక్కసారిగా వికసించింది. "వదినా! అదేమిటో చెప్పు. జీవితాంతం నీకు సేవ చేసుకుంటూ పడుంటాను," అన్నాడు.

"కోదండరామయ్యగారు తమ కూతురి పెళ్ళి వీడియో తీయించారు. అదొకసారి .చూస్తామని చెప్పి తెప్పిస్తాను. అందులో ఆ అమ్మాయి వుందేమో చూసి గుర్తిపట్టు. ఆ తర్వాతి సంగతి అప్పుడాలోచిద్దాం."

వేణు ఆ మాటకు ఎగిరి గంతేశాడు. "వదినా! నీ తెలివితేటలు అమోఘం! నువ్వెంత మంచిదానివి! ఆ అమ్మాయి ఎవరో తెలిస్తే పాలుపోసి నీ కాళ్ళు కడుగుతాను. ఇంత మంచి ఆలోచన నాకింతవరకూ తట్టనేలేదు. ఆ అమ్మాయిని చూసిన క్షణం నుంచీ నా మెదడు ఇదిగో ఇలాగే మొద్దుబారిపోయింది," అన్నాడు.

వసిపిల్లవాడికి మిఠాయికొని పెడతాననగానే ప్రదర్శించే ఆనందంలాంటి ఆ ఆనందాన్ని సుమిత్ర పెద్దగా పట్టించుకోలేదు. కాగా అతని

## దాదా హయాత్



ఈ కథ కోసం ప్రత్యేకంగా తీయించిన ఫోటో ఇది. ఫోటోగ్రాఫర్: వై.ఎస్.ఎన్. మూర్తి.

వంక హెచ్చరికగా చూసింది.

"ఒక్కమాట గుర్తుంచుకో చిన్నా! ఆ అమ్మాయిని తెచ్చి నీకు కట్టబెడతానని నేనేమీ మాటివ్వడం లేదు. నీ బాధ చూడలేక ఆ అమ్మాయెవరో కనుక్కుందామని ఈ మాత్రమైనా చేస్తున్నాను. ఒకసారి ఆ అమ్మాయెవరో తెలిశాక ఏం చేయాలనేది నేనింకా నిర్ణయించుకోలేదు. ఒకవేళ ఆ అమ్మాయి నీకు తగ్గది కాదని నాకనిపిస్తే ఆ మాట ఖచ్చితంగా నీతో చెప్పేస్తాను. ఆ తర్వాత జరగబోయే పరిణామాలకు నువ్వే బాధ్యుడివవుతావు," అంది.

వేణు ఆమె చేతులు పట్టుకున్నాడు.

"వదినా! ఈ విషయంలో నీకేది మంచిదని తోస్తే అదే చెయ్యి. మా వదిన నాకు అన్యాయం చేయదని నాకు బాగా తెలుసు," అన్నాడు.

★ ☆ ✪ ☆

కోదండరామయ్యగారి కూతురి పెళ్ళి వీడియోలో చూసే ఏర్పాటు సుమిత్ర చాలా తెలివిగా చేసింది. ఆ కేసెట్ చూడ్డానికి ఇంట్లో వాళ్ళందరూ కూర్చున్నారు. వాళ్ళతో పాటు వేణు కూడా కూర్చున్నాడు. అతని వాలకం ఉద్వేగభరితంగా వుంది.

వీడియో చూడ్డం పూర్తయ్యాక అతన్ని పక్కకు పిలిచి అడిగింది సుమిత్ర- "ఆ అమ్మాయి కనిపించిందా?"

వేణు మొహం నిరాశతో నిండిపోయింది. ఆ అమ్మాయి కనిపించలేదన్నట్టు నీరసంగా తలాడించాడు.

"అదేం?" కొంచెం ఆశ్చర్యంగా అడిగింది సుమిత్ర.

"అదేమో నాకు తెలీదు. మాంగల్యధారణ జరుగుతున్నంతసేపూ ఆ అమ్మాయి పెళ్ళికూతురికి దగ్గర్లోనే వుంది. అయితే వీడియోలో మాత్రం ఆమె ఎక్కడా పడలేదు. వీడియో కెమెరా తనవైపు తిరుగుతున్నప్పుడు ఆమె ఆడవాళ్ళలో బాగా వెనక్కి వెళ్ళిపోయిందో, వీడియోలో పడ్డానికి మిగతా ఆడవాళ్ళు ఆమెను వెనక్కి నెట్టేసి ముందుకొచ్చారో చెప్పలేను. వీడియోలో మాత్రం ఆమె ఎక్కడా పడలేదు. కనీసం ఆమె నీడకూడా వీడియోలో కనిపించలేదు," చెప్పాడతను.

అతని మాటల్లో తాండవమాడుతున్న నిస్పృహ గమనించి అంతకంటే ఎక్కువగా అతన్ని కదిలించడం మంచిది కాదని సుమిత్ర మౌనంగా అక్కడ్నించి నిష్క్రమించింది.

ఆ రాత్రి దాదాపు ఒంటిగంటప్పుడు తన గదిలో పిల్లలతో నిద్రపోతున్న సుమిత్రకు ఎందుకో మెలకువొచ్చింది.

వేణు గది ఆ పక్కనే వుంది. ఆ గదిలో లైటు ఇంకా వెలుగుతున్నట్టుగానే అనిపించడంతో అతనేం చేస్తున్నాడోనని అనుమానం వచ్చి పక్క మీదనుంచి లేచి వెళ్ళింది.

వేణు అతని గదిలో చేస్తున్న పని ఆమెకు ఆశ్చర్యం కలిగించలేదు.

తన గదిలోకి ఏకంగా అతను టీవీ, వీసిఆర్ ఎత్తుకొచ్చేశాడు. ఆ పెళ్ళి కేసెట్ మాటిమాటికీ వెనక్కీ ముందుకీ తిప్పుతూ టీవీలో బొమ్మ పట్టి పట్టి చూస్తూ జుట్టు పీక్కుంటున్నాడు.

సుమిత్రకి అతని పరిస్థితి జాలి కలిగించింది.

చరచరా ఆ గదిలోకి వెళ్ళి టీవీ, వీసీఆర్ రెండు కట్టేసింది.

"ఏమిటిది చిన్నా! మరీ పసివాడిలా ప్రవర్తిస్తున్నావ్. వీడియోలో ఆ అమ్మాయి

కనబడదని తెలిసిపోయింది. అలాంటప్పుడు అనవసరంగా బుర్ర పాడు చేసుకుని రాత్రంతా వీడియో చూస్తూ కూర్చుంటావా? నా మాట విని ఈ పూట ప్రశాంతంగా నిద్రపో. ఆ అమ్మాయి విషయం ఏం చేయాలో రేపు ఆలోచిద్దాం," బుజ్జగిస్తున్నట్టుగా అంది.

వేణు ఏమీ మాట్లాడలేదు. గాఢంగా ఒక పెద్ద నిట్టూర్పు విడిచి తన మంచం మీద అవతలికి తిరిగి ముడుచుకు పడుకున్నాడు.

సుమిత్ర మరింక అతన్ని మాట్లాడించ కుండా ఆ గదిలో లైటార్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళాక కూడా వేణు నిద్రపోలేదు.

ఆ రాత్రంతా అతని కళ్ళు తెరిచిపెట్టుకునే వున్నాయి.

✪ ☆ ☆ ★

వేణు పెళ్ళికి విముఖంగా వున్నాడని ఇంట్లో అందరికీ తెలిసిపోయింది. కారణం ఏమిటనేది మాత్రం ఒక్క సుమిత్రకు తప్ప మరెవరికీ తెలీదు.

వేణు చిన్నప్పట్నుంచీ తన కష్టసుఖాలు వదినగారితో చెప్పుకుంటాడని ప్రతి ఒక్కరికీ తెలుసు. అందుకే వేణు తండ్రి సుమిత్రను పక్కకు పిలిచి విచారించాడు.

"చూడమ్మా! వీడి ప్రవర్తన నాకు బొత్తిగా అంతుపట్టడంలేదు. పెళ్ళి సంగతి ఎత్తితే గంగ వెర్రులెత్తినట్టు ప్రవర్తిస్తున్నాడని మీ అత్తయ్య నాతో చెప్పింది. నా ముందైతే ఆ విషయం అసలు మాట్లాడ్డమే ఇష్టం లేదన్నట్టుగా వుంటు న్నాడు. అసలేమిటి సంగతి? వీడి నెత్తిమీద పాతికేళ్ళొచ్చాయి. ఏదో మంచి ఉద్యోగమే చేసుకుంటున్నాడు. అలాంటివాడికి పెళ్ళి చేసు కోవడానికి ఇప్పుడొచ్చిన రోగమేమిటట? కనీసం నీతో అయినా ఏమైనా చెప్పాడా?"

సుమిత్రకు మొహం నిండా చిరునవ్వు పులుముకోవలసి వచ్చింది. "చిన్నాదేముం దిలెండి మావయ్యా! ఎంత పాతికేళ్ళొచ్చినా, ఎంత ఉద్యోగం చేస్తున్నా వాడింకా చిన్న పిల్లవాడే. నలుగురు స్నేహితుల మధ్య తిరుగుతున్నవాడు. ఒక్కసారిగా పెళ్లి చేసి బాధ్యత తలకెత్తుతామంటే కొంచెం బెదిరిపోవ డం సహజమే. క్రమంగా వాడి ప్రవర్తన దానికదే సర్దుకుంటుంది. మీకెందుకు, మీరు నిశ్చింతగా వుండండి," అంది.

"అంతేనంటావా? లేక, మరింకేమైనా వుందా?"

ఆ మాటకు సుమిత్ర గుండె దడదడా కొట్టేసుకుంది.

"అంతేకాక మరింకేముంటుంది



ఏం చేద్దాం

శోభనంరాత్రి...

"నీకు క్రొత్త... నాకు క్రొత్తే మరి... ఇప్పుడేం చేద్దాం?" ప్రేమగా అడిగాడు భార్యని.

"మన ఖర్మ అనుకొని... విడాకులు తీసు కుందాం... అందుకే అన్నాను అందగాడు కాదు అనుభవజ్ఞుడు కావాలని... మా వాళ్ళు వింటేగా" చిరాకుగా జవాబు ఇచ్చింది గయ్యాళి భార్య.

- సాయిగంగాధర్ చామర్తి.

మావయ్యా?" అనేసింది.

కోడలి మాటతో ఆయన కుదుటపడ్డాడు.

"ఏమిటో ఎన్నడూ లేంది వీడిలా చిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. ఎప్పుడూ మొహం ముడుచు కునే వుంటున్నాడు. అన్నం కూడా సమంగా తినడం లేదు. కనిపెంచిన వాళ్ళం మేమే అయినా వాడు తల్లిలా చూసుకునేది మాత్రం నిన్నే. నువ్వు కూడా వాణ్ణి నిర్లక్ష్యం చేయవద్దు," అన్నాడు.

ఆ సాయంత్రం వేణు ఇంటికి రాగానే సుమిత్ర అతని మీద విరుచుకుపడింది. "నువ్వీ ఇంట్లో నన్ను మర్యాదగా బదకనిస్తావా లేదా?" అంటూ ఉన్నపళంగా అతన్ని నిలదీసేసరికి వేణు అదిరిపోయాడు.

"నేనేం చేశాను వదినా?" అన్నాడు.

"అందరూ నన్నే అంటున్నారు. వదిననీ తల్లినీ నేనే అయ్యుండి నిన్ను నిర్లక్ష్యం చేస్తున్నానట! అంటారు. ఎందుకనరు? నీ కసలు నా మీద జాలీ దయా వుంటేకదా! అన్నం మానేసి గడ్డం పెంచేసి దేవదాసులా తిరిగినంతమాత్రాన ఆ అమ్మాయి దొరికి పోతుందా? అయినా ఇదేం విడ్డూరం! ముక్కూ మొహం తెలీని అమ్మాయినెవర్నో నువ్వు ప్రేమించడం, ఆమె దొరకలేదని బాధపడి పోతూ తిరగడం! బావుంది నాయనా! చాలా బావుంది! నీ వెర్రిలో నువ్వున్నావు. మధ్య నా ప్రాణానికొచ్చింది," అంటూ కొంగుతో కన్నీళ్ళు వత్తుకుందామె.

వదినగారి కన్నీళ్ళు చూసి వేణు హతాశుడై పోయాడు.

"ఇప్పుడు నన్నేం చేయమంటావో చెప్పు," అన్నాడు దీనంగా.

"నువ్వేం చేయాలో చెప్పడానికి నేనెవర్ని...? ఒకవేళ చెప్పినా నువ్వు వింటావు గనకనా!"

"నువ్వా మాట అనొద్దు వదినా! చెప్పి చూడు. నీ ఆజ్ఞ నేను శిరసావహిస్తానో లేదో నీకే తెలుస్తుంది."

"అలాగని నాకు మాటిస్తావా?"

"నీ మీద ప్రమాణం చేస్తున్నాను."

సుమిత్ర తేలిగ్గా నిట్టూర్చింది. "అయితే నోరెత్తకుండా పెద్ద వాళ్ళు తెచ్చిన సంబంధం చేసుకో ఆ అమ్మాయిని మర్చిపో. ఆమె నీకు దొరకదు. ఆకాశంలో అకస్మాత్తుగా ఒక నక్షత్రం రాలిపడి తళుక్కున మెరుస్తుంది. ఆ తర్వాత మళ్ళీ కనిపించదు. ఇదీ అంతే! నా మాట విను. అనవసరమైన విరహాలు మాని ఈ పెళ్ళి చేసుకో," అంది.

వేణు చాలా సేపు ఏమీ మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నాడు. చివరికో నిర్ణయానికి వచ్చినట్టు గాఢంగా నిట్టూర్చి, "సరే! నువ్వు చెప్పినట్టుగానే చేస్తాను. కానీ, ఈ పెళ్ళి చేసు కుని నేను సుఖపడతానని మాత్రం ఆశించవద్దు," అంటూ అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయాడు.

సుమిత్ర వేయి దేవుళ్ళకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది.

★ ☆ ✪ ☆

వేణు పెళ్ళి జరిగిపోయింది.

అతనికి భార్యగా వచ్చిన అనురాధ చక్కనైన పిల్ల. బాగా చదువుకున్నది కూడా. వేణుకి అంత చక్కని భార్య దొరికినందుకు అతని స్నేహితు లంతా అతన్ని అభినందించారు.

అయితే వాళ్ళెవరూ గుర్తించని విషయం ఒకటుంది. వేణు పెళ్ళి పందిట్లోగాని, మరెక్కడా గాని పెళ్ళికూతురికేసి ఒక్కసారైనా కన్నెత్తి చూడలేదు. సుమిత్ర ఒక్కతే ఆ విషయం ప్రత్యేకంగా గమనించగలిగింది. ఆమె మనసు చెప్పలేనంతగా కలవరపడింది.

మొదటి రాత్రి వేణు అనురాధని పలకరించనైనా పలకరించలేదు. ఆమె అవతల మంచం చివర కూర్చొని వుండగా అతను ఆమె వైపు కూడా చూడకుండా తన దిండందుకుని ఇవతలికి తిరిగి పడుకున్నాడు. అతను తనని పలకరిస్తాడని ఎదురు చూసి చూసి అనురాధ దిండు కూడా లేకుండా మంచం పట్టిమీద తల మోపి అలాగే నిద్రపోయింది.

ఆ మర్నాడు ఉదయమే సుమిత్ర ఆత్రంగా వచ్చిందామె దగ్గరికి. వేణు చేరదీసిన లక్షణాలేవీ అనురాధలో కనిపించకపోయేసరికి ఆమె మనసు కళవళ పడిపోయింది. అక్కడికీ మన

నుండబట్టలేక అడిగేసింది-

"ఏమ్మా, మా అబ్బాయి నిన్ను ప్రేమగా చూసుకున్నాడా?"

అనురాధ ఆ మాటకు సిగ్గుపడుతున్నదానిలా తల వంచుకుంది. అయితే ఆమె మొహంలో సంతోషమనేది ఏ కోశానా కనిపించకపోయేసరికి సుమిత్రకు అనుమానం ధృవపడిపోయింది. ఆ క్షణంలో ఆమె పడిన ఆందోళన అంతా ఇంతా కాదు.

"చూడమ్మా! మన దేశంలో పెళ్ళికి ముందు కొంచెం కూడా ఒకరికొకరు తెలీని ఇద్దరు అపరిచితులు పెళ్ళి తర్వాత ఒక్కసారిగా దగ్గరకావలసిన చిత్రమైన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సమయంలో ఒక్కొక్కరి మానసిక పరిస్థితి ఒక్కొక్క విధంగా వుంటుంది. అది అయిష్టమని అనుకోనక్కర్లేదు. సంకోచం కావచ్చు. చదువుకున్నదానివి. నీకు విడమర్చి చెప్పనక్కర్లేదు. అతను పలకరించడానికి బిడియపడితే నువ్వు మొదట పలకరించడంలో ఏమీ తప్పులేదు," అంది.

ఆ రాత్రి అనురాధే చొరవ తీసుకుని వేణుని పలకరించింది.

"ఎందుకలా వున్నారు? తల నొప్పిగా వుందా?"

వేణు మాట్లాడలేదు. అవతలికి తిరిగి కళ్ళు మూసుకు పడుకున్నాడు.

"నేను తల పట్టేదా?" సంకోచిస్తూనే అడిగిందామె.

వేణు కళ్ళు తెరవకుండా, "ఊ," అన్నాడు.

అనురాధ మునివేళ్ళు మృదువుగా అతని నుదురు తాకాయి. అయినా అతన్లో ఏమాత్రం స్పందన కనిపించకపోవడంతో అనురాధకు కళ్ళనీళ్ళు తిరిగాయి. పొర్లుకొస్తున్న కన్నీళ్ళు అణిచిపెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ కొద్దిసేపు అని తల పట్టింది. తర్వాత దుఃఖం ఆపుకోవడం సాధ్యం కాక రెండు చేతుల్లోనూ మొహం దాచుకుంది.

"నేనంటే అంత ఇష్టం లేనప్పుడు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు?" వెక్కుతూ అడిగింది.

అతన్నుంచి సమాధానం లేదు.

"పెళ్ళి చూపులు కూడా అవసరం లేకుండా మీరే పెళ్ళికి ఒప్పుకున్నారంటే మా సంబంధం మీకు చాలా నచ్చిందని మా వాళ్ళంతా సంబరపడిపోయారు. ఇప్పుడు నా మీద మీకెందుకింత నిర్దయ?" ఉక్రోషంగా అంది.

ఆ మాటకూ సమాధానం రాకపోయేసరికి ఏడ్చి ఏడ్చి శోషవచ్చినట్టు అలాగే పడిపోయింది.



### క్లాస్ రూమ్ జోక్

మాస్టారు: ఏరా రామూ! నిన్నటివరకు హోమ్‌వర్క్ ఎప్పుడూ తప్పులు చేసేవాడివి. ఈ రోజు కరెక్టుగా వుంది. మీ నాన్నగారి చేత చేయించావా?

రాము: లేదు మాస్టారూ! ఇవాల్టినుంచి నేనే చేస్తున్నాను.

-సి. హెచ్. చంద్రశేఖర్, గోషామహల్

ఆ మర్నాడు సుమిత్రకు అనురాధ పరిస్థితి పూర్తిగా అర్థమైపోయింది. దాంతో ఆమె గుండె కుతకుతా ఉడికిపోయింది. వేణు ఒంటరిగా కనిపిస్తూనే అతన్ని బలవంతంగా చొక్కా పట్టుకు లాక్కెళ్ళి కుర్చీలో కూలేసింది.

"చిన్నప్పుడు నువ్వు సుకుమారంగా, చాలా అమాయకంగా వుండేవాడివి. అందుకే మీ నాన్నగారు కానీ, మీ అన్నగారు కానీ కనీసం నీ వంటి మీద ఒక చిన్న దెబ్బ కూడా వేయకుండా కాపాడుకుంటూ వచ్చేదాన్ని. ఇప్పుడు నాకే నీ వళ్ళు చీరేయాలనిపిస్తోంది," అంది.

వదిన గారిలో ఆ రౌద్రం వేణు ఎన్నడెరుగనిది.

అతనేదో చెప్పబోయాడుగానీ సుమిత్ర అతన్ని ఏమాత్రం మాట్లాడనివ్వలేదు.

"ఈ లోకంలో అన్ని పెళ్ళిళ్ళూ అందరి ఇష్టప్రకారమే జరగడంలేదు.. అంతమాత్రం చేత అందరూ నీలా కాపురాలు కూలదోసుకుంటున్నారా? నీకు ఇష్టంలేని పెళ్ళి చేశానని నా మీద ఇలా కక్ష తీర్చుకుంటున్నావు కాబోలు. ఆ అమ్మాయిని తాకకుండా హింస పెట్టి ఆ పాపం నా తలకు చుట్టాలని కదూ నీ ఆలోచన," అని ఏడుస్తూ ఆమె అతని ఎదురుగా నేలమీద కూలబడిపోయింది.

"వదినా!" కంగారుగా అన్నాడు వేణు.

"నన్ను వదినా అని పిలవొద్దు. ఆ అమ్మాయిని నువ్వు సరిగ్గా ఏలుకోని పక్షంలో నేను ఉరిపోసుకు ఛస్తాను," అంటూ విసురుగా అంటూ విసురుగా అక్కడ్నించి లేచి వెళ్ళిపోయింది.

ఆ రోజంతా వేణు ఇంట్లో ముళ్ళ మీద కూర్చున్నట్టు గడిపాడు.

మళ్ళీ రాత్రైంది.

అతనికి తన గదిలోకి వెళ్ళక తప్పలేదు.

ఆ తర్వాత చాలా సేపటికిగాని అనురాధ ఆ గదిలోకి రాలేదు.

ఆమె నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వచ్చే సమయానికి అతను కిటికీ దగ్గర నిలబడి బయట ఆకాశంలో నిండుగా వెలుగుతున్న చందమామ వైపే చూస్తున్నాడు. అయితే ఆ చందమామ అతన్లో ఎలాంటి స్పందనా కలిగించడంలో విఫలమవుతున్నాడు.

అనురాధ క్రమంగా అతన్ని సమీపించి అతని వెనకే నిలబడింది. "మీరు నన్ను ఇష్టంలేని పెళ్ళి చేసుకున్నారని ఈ రోజే తెలిసింది," అంది.

వేణు ఉలిక్కి పడ్డాడు.

"ఆ మాట నీకెవరు చెప్పారు?" అన్నాడు.

"పొద్దున సుమిత్రక్కయ్య మీతో అన్న మాటలు విన్నాను."

వేణుకి ఏమనడానికీ నోరు పెగల్లేదు.

అనురాధ ఒక్కసారిగా అగ్ని పర్వతంలా బద్దలైంది.

"మీకు ఇష్టం లేకపోయినా మీతో ఉండడానికి నేను ప్రాణంలేని బొమ్మని కాదు. ఈ రాత్రి గడిస్తే రేపెలాగూ మా ఇంటికి వెళ్ళిపోతాను. అక్కడ మా నాన్నగారి గుండె బద్దలైనా సరే, ఈ పెళ్ళి రద్దు చేయమని చెప్పేస్తాను," అనదల్చుకున్న మాట అనేసి ఏడుస్తూ గుమ్మం వైపు పరిగెత్తింది.

వేణులో అప్పటికి గాని చలనం రాలేదు.

"అనురాధా! ఒక్క నిమిషం," అంటూ తనూ ఆమెతోపాటు పరిగెత్తి గుమ్మం దగ్గర భుజం పట్టుకుని ఆపేశాడు.

ఆమె విసురుగా తన వైపు తిరిగేసరికి అతని తల మీద పిడుగు పడ్డట్టయ్యింది.

అతను తన మొహంలోకి పిచ్చివాడిలా చూడ్డం ఆమె పట్టించుకోలేదు.

"ఇంకా ఏం మిగిలింది నన్నాపుతున్నారు?" ఆవేశంగా అడిగింది.

అతను అమాంతం ఆమె ఎదురుగా మోకాళ్ళ మీద కూలబడి ఆమె నడుము చుట్టేసుకున్నాడు.

"లేదు, నిన్ను ఎక్కడికీ వెళ్ళనివ్వను. జీవితంలో ఇలాంటి అద్భుతాలు కూడా జరుగుతాయని నాకు తెలీదు. ఇప్పుడు నువ్వు నన్ను వదిలిపెట్టి వెళ్తే ఆత్మహత్య చేసుకుంటాను," అన్నాడు.

●